ఈనాటి

# తెలుగోడు

PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 162 | గురువారం 12 మార్చి 2026 | పేజీలు -6 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

## అమెరికాలో రిలయన్స్ ఆయిల్ రిఫైనరీ

- 300 బిలియన్ డాలర్లతో భారీ ప్రాజెక్ట్..
- రిలయన్స్‌తో అమెరికా ప్రభుత్వం ఒప్పందం..
- సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్..



**వాషింగ్టన్ (తెలుగోడు),మార్చి 11 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 300 బిలియన్ డాలర్ల చమురు శుద్ధి కర్మాగార ప్రాజెక్టును టెక్సాస్‌లో ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో భారతదేశ రిలయన్స్ ఇండస్ట్రీ భాగస్వామి క ఆవడం విశేషం. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఈ ప్రాజెక్టను అమెరికా చరిత్రలో అతిపెద్ద ఒప్పందం గా పేర్కొన్నారు. ఇది అమెరికన్ కార్మికులు, ఇంధన వృద్ధి, దక్షిణ టెక్సాస్ ప్రజలకు భారీ విజయం అని అభివర్ణించారు. ట్రంప్ ప్రకటన ప్రకారం.. ఈ ప్రాజెక్ట దేశీయ ఇంధన ఉత్పత్తిని బలోపేతం చేయడానికి, పారిశ్రామిక పెట్టుబడులను విస్తరించడానికి ఓ ముఖ్యమైన దశగా ఉంటుంది. బ్రౌన్స్‌విల్లే నౌకాశ్రయంలో ఉనికిలో ఉండే అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ సంస్థ దీనిని అభివృద్ధి చేస్తుంది. ట్రంప్ ఈ ప్రాజెక్టును ఆర్థిక, వ్యూహాత్మక మైలురాయిగా పేర్కొన్నారు. అయితే, పెట్టుబడి నిర్మాణం, ఖర్చులు లేదా ఆర్థిక వివరాలపై ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. గత 50 ఏళ్లలో అమెరికా గడ్డపై నిర్మించతలపెట్టిన మొట్టమొదటి రిఫైనరీ ఇదే కావడం విశేషం. ఈ మెగా (మిగతా 2లో)

## ఉగాదికి 2.50 లక్షల
# గృహ ప్రవేశాలు



- సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి..
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సమస్యల ఆకళింపు..
- రానున్న కాలంలో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గించేలా చర్యలు..
- సౌర వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలి..
- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం...

**అమరావతి (తెలుగోడు),మార్చి 11 :** సంక్షేమం, అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. కలెక్టర్లకు వివిధ అంశాలపై లక్ష్యాలను సీఎం నిర్దేశించారు. అధికారులు ప్రజాప్రతినిధుల కార్యక్రమాలపై సీఎం కార్యాచరణ ప్రకటించారు. గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చాం. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్దిదారులకు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తాం. గత పాలనలో ట్రూ అప్ పేరిట విద్యుత్ ఛార్జీల భారం వేస్తే.. మేం ట్రూడౌన్ చేశాం. రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం అని తెలిపారు. మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టి ప్రభత్వ విధానాలపై క్లారిటీ ఇస్తున్నామని తెలిపారు. వెల్ఫేర్, డెవలప్‌మెంట్, గుడ్ గవర్నెన్స్ బ్యాలెన్సింగ్ చాలా అవసరమని చెప్పారు. వర్చువల్, ఫిజికల్ వర్కింగ్ ఈరోజు రీయాలిటీగా మారుతోందని సీఎం అన్నారు. 'పర్వాలేదు' అనే ఉదాసీనత కూడా చేయాల్సిన పనులపై ప్రభావం చూపుతాయని తెలిపారు. గతంలో విజన్ 2020 పెట్టినప్పుడు చాలామంది విమర్శించారని.. ఇప్పుడు అది ఫలితాన్ని ఇవ్వడంతో 2047వైపు అందరూ చూస్తున్నారని సీఎం అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో నిర్దిష్టమైన టార్గెట్‌లను ఫిక్స్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈసారి 15 పాయింట్లను ఈ ఏడాది లక్ష్యాల కింద ఇస్తున్నట్లు చెప్పారు. 20 నెలల్లో సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని అన్నారు. ఏ సంక్షేమ కార్యక్రమం ఎప్పుడు చేస్తామో ముందే చెబుతామని.. దానికి తగ్గ ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఈ నెలలో 13వ 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు తెలిపారు సీఎం. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్మును జమ చేస్తుందన్నారు. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు (మిగతా 2లో)

## పశ్చిమాసియా యుద్ధంపై
# రాజకీయాలా



- కాంగ్రెస్, కమ్యూనిస్టుల తీరుపై మండిపడ్డ ప్రధాని..
- గల్ఫ్‌లో చిక్కున్న వారిని ఇండియాకు తీసుకుని వస్తున్నాం..
- అక్కడి ప్రభుత్వాలు భారత్‌కు అండగా నిలిచాయి..
- రాహుల్‌కు అభివృద్ధి గురించి తెలియదు..
- విమర్శించడమే రాహుల్‌కు తెలిసిన పని..
- కేరళం పర్యటనలో మోడీ ఘాటు విమర్శలు..

**తిరువనంతపురం (తెలుగోడు),మార్చి 11 :** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. (మిగతా 2లో)

## ఆస్కార్ వేడుకకు
# రంగం సిద్ధం

### 15న సాయంత్రం ప్రత్యక్ష ప్రసారం




**లాస్ ఏంజిల్స్ (తెలుగోడు), మార్చి 11 :** ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే అతి పెద్ద వేడుక 'ఆస్కార్స్ 2026' 98వ అకాడమీ అవార్డ్స్ కు సర్వం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందించేందుకు లాస్ ఏంజెల్స్ లోని డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అగశ్రేణి హాలీవుడ్ (మిగతా 2లో)

## చంద్రబాబును సీఎం గానే భరించలేకున్నాం
# ఇక ఉప ప్రధాని అయితే ?

- రాష్ట్రాన్ని అప్పుల బారిన నెట్టిన బాబు..
- ఎన్నికల హామీలు ఎక్కడ అంటూ ప్రశ్న..
- ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శ..
- నిరాశలో రైతులు, యువత, మహిళలు..
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నిజాలు చెప్పాలి..
- వైయస్ జగన్...



**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 11 :** రాష్ట్రంలో కొనసాగుతున్న పాలన ప్రజలకు మేలు చేయడం కంటే ఇబ్బందులు పెంచే విధంగా సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తాడేపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిగా ఆయనను భరించడమే కష్టంగా ఉందని, ఇలాంటి పరిస్థితిలో ఆయనకు మరింత పెద్ద బాధ్యతలు వస్తే ప్రజల పరిస్థితి ఏమవుతుందో ఆలోచించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పాలన ప్రజల ఆశలు నెరవేర్చే దిశగా లేదని జగన్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రజలకు సంక్షేమం అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వారు ఇప్పుడు ఆ హామీలను మరిచిపోయారని అన్నారు. రైతులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకునే పరిస్థితి 2లో

## కేంద్రమాజీమంత్రి
# కావూరి మృతి

- అనారోగ్యంతో చికిత్సపొందుతూ మరణం...
- కావూరి మృతిపై చంద్రబాబు తదితరుల సంతాపం..



**హైదరాబాద్ (తెలుగోడు),మార్చి 11 :** తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు తనదైన ముద్ర వేసిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు (82) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కావూరి సాంబశివరావు (మిగతా 2లో)

## అమెరికా ఆర్థిక సంస్థలపై
# దాడులు చేస్తాం

### అమెరికా యుద్ధంపై ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 11 :** ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమై 12వ రోజుకు చేరుకుంది. ఇదే సమయంలో యుద్ధాన్ని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమని ఇరాన్ ప్రకటించింది. ఇకపై అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ సెంట్రల్ ఆపరేషనల్ కమాండ్ ఖాటమ్ అల్ అన్బియా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ సంస్థలు, (మిగతా 2లో)

## మార్చి 28 నుంచి
# ఐపిఎల్ సందడి

- తొలి వారంలో ఏడు ఉత్కంఠభరిత మ్యాచ్‌లు..
- హైదరాబాద్, చెన్నై, ముంబయి మైదానాల్లో సందడి..
- వారాంతంలో రెండు మ్యాచ్‌లతో అభిమానులకు పండుగ..
- ప్రారంభం నుంచే కఠిన పోటీకి రంగం సిద్ధం..



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 11 :** దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ కొత్త సీజన్ మార్చి 28న ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ బెంగళూరులో జరగనుంది. ఆరంభ పోరులో బెంగళూరు జట్టు, హైదరాబాద్ జట్టు తలపడనున్నాయి. ప్రారంభ వేడుకల మధ్య జరిగే ఈ పోటీతో దేశమంతా క్రికెట్ ఉత్సాహంలో మునిగిపోనుంది.మార్చి 29న చెన్నైలో చెన్నై జట్టు, ముంబయి జట్టు మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం అహ్మదాబాద్‌లో గుజరాత్ జట్టు, కోల్‌కతా జట్టు మధ్య మరో పోరు జరుగనుంది. వారాంతం కావడంతో రెండు మ్యాచ్‌లు (మిగతా 2లో)

## పెన్షన్లపై ఆరోపణలు
# అసత్యం



### మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పెన్షన్లు మాత్రమే రద్దు..

**అమరావతి (తెలుగోడు), మార్చి 11 :** రాష్ట్రంలో భారీ ఎత్తున పెన్షన్లు తొలగిస్తున్నారనే ఆరోపణలను ప్రభుత్వం ఖండించింది. మృతిచెందిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పెన్షన్లు మాత్రమే రద్దు చేసినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పెన్షన్లపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.వైఎస్ జగన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో చేసిన ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని మంత్రి తెలిపారు. గత పాలనలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరు దశల ధృవీకరణ పేరుతో పెద్ద ఎత్తున పెన్షన్లు తొలగించారని విమర్శించారు. ఐదేళ్ల కాలంలో లక్షల సంఖ్యలో పేదల పెన్షన్లు నిలిపివేసి వారికి తీవ్ర ఇబ్బందులు కలిగించారని మండిపడ్డారు.ఇష్టం వచ్చిన విధంగా పెన్షన్లు తొలగించిన కాలం గత ప్రభుత్వదేనని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఇరవై నెలల పాలనలో అన్యాయంగా ఒక్క పెన్షన్ కూడా రద్దు కాలేదని ఆయన తెలిపారు. పేదలకు నష్టం కలిగించే విధంగా చర్యలు తీసుకునే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు.ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నెలా జీవిత భాగస్వామి కోటాలో వితంతువులకు పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. (మిగతా 2లో)

## అమరావతిలో
# భారీ అగ్నిప్రమాదం

- ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో పైపులు దగ్ధం..
- సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది..



**అమరావతి (తెలుగోడు), మార్చి 11 :** రాజధాని ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. వెలగపూడి ఎన్ 9 జంక్షన్ వద్ద ఉన్న ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో బుధవారం మంటలు చెలరేగాయి. అక్కడ నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా మంటలకు ఆహుతయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతం మొత్తం పొగతో కమ్ముకుంది. పెద్ద ఎత్తున పొగలు ఎగసిపడటం గమనించిన స్థానికులు వెంటనే అధికారులకు (మిగతా 2లో)

తెలుగోడు

# ఉగాదికి 2.50లక్షల గృహప్రవేశాలు




(మొదటి పేజి (తరువాయి)

ప్రతినిధులతో కలిసి 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని సమర్థంగా తీసుకెళ్లామని సీఎం తెలిపారు. ఖరీఫ్‌కు ఇప్పటి నుంచే ప్రిపరేటరీ వర్క్ చేయాలని సీఎం సూచించారు. మే 15న నీటిని విడుదల చేస్తున్నామని, ఈ సీజన్లో ముందుగానే నీరు ఇస్తామన్నారు. ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తామని చెప్పారు. దివ్యాంగులకు 'ఇంద్రధనస్సు' పేరుతో ఉచిత సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. చరిత్రలోనే తొలిసారి విద్యుత్ రంగంలో ట్రూ డౌన్ చార్జీలను ప్రవేశపెట్టామని.. వినియోగ దారులకు బెనిఫిట్ వచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యుత్ చార్జీలను 39 పైసలు తగ్గిస్తున్నామని.. తద్వారా వినియోగదారులపై భారం భారీగా తగ్గనుందన్నారు. 6 లక్షల సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయాలనేది ట-గ్గ-ట్‌గా పెట్టుకున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని నిర్ణయించామని సీఎం అన్నారు. అయితే ఏడాదిలోనే లక్ష 15వేల మందిని తయారు చేశామన్నారు. ఈ ఏడాది 5 లక్షల మందిని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఎస్టోనియా, ఇజ్రాయిల్, సింగపూర్‌ల ఎంట్రప్రెన్యూర్‌లను తీసుకువచ్చారని.. ఏపీలో కూడా ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పినట్టు అగ్రికల్చర్ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను డీప్ యూనివర్సిటీగా తేవాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పాదన ఓ సంపాదనా మార్గంగా మారాలని సీఎం చంద్రబాబు అన్నారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంటప్రెన్యూర్ కింద 1.12 లక్షల మంది మహిళా మైక్రో ఎంటప్రెన్యూర్‌లు తయారయ్యారని తెలిపారు. మే 15 నుంచే సాగుకు సిద్ధం అవుదామని.. ఏఐ అగ్రానమిస్ట్ సేవలు కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతీ వ్యవసాయదారుడికి ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. సమగ్ర నీటి నిర్వహణ చాలా కీలకమైన అంశమని.. నీటి భద్రత కోసం చేపట్టిన చర్యల వల్ల మంచి ఫలితాలు ఇచ్చాయని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.82 మీటర్ల మేర భూగర్భజలాలు గడచిన రెండు నెలల్లో పెరిగాయన్నారు. మార్చి 1 నాటికి 8.10 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయని వెల్లడించారు. 90 రోజుల పాటు ఏప్రిల్ 1 నుంచి జూన్ నెలాఖరు వరకూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. నో సట్ మె-ఙ్గ-న్స్ విధానంలో కాలువలు పూడికలు, చెరువుల లింకేజి లాంటి కార్యాచరణ చేపట్టాలన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 614 టీఎంసీల నీళ్లు రిజర్వాయర్లలో ఉన్నాయని సీఎం అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాగు సీజన్ను ముందుకు తీసుకువచ్చేలా ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. భూగర్భ జలాలు పెరిగితే ప్రభుత్వం ఇస్తున్న రూ.14 వేల కోట్ల విద్యుత్ సబ్సిడీల భారం తగ్గుతుందన్నారు. వెలిగొండను జూలై నాటికి పూర్తి చేసి నీటిని ఇస్తామని... 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టును 2027లో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులు ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎక్కడా భూ వివాదాలు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. పిటిషన్ కల్చర్లను తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. వాస్తవాలన్నీ పోర్టల్లో పెడితే వివాదాలు తగ్గుతాయన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారం కావాలని... అకౌంటబిలిటీ ఫిక్స్ చేయాలని తెలిపారు. భూ వివాదాలు లేకపోతే 70 శాతం సమస్యలు తగ్గుతాయని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, మంత్రులు పాల్గొన్నారు.

# కేంద్ర మాజీ మంత్రి కావూరి మృతి

(మొదటి పేజి (తరువాయి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎంపిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. మన్మోహన్ కేబినేట్‌లో మంత్రిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం రాజకీయ రంగానికి తీరని లోటుగా పలువురు నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు నేతలు కావూరి సాంబశివరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని తెలిపారు. మచిలీపట్నం, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసిన కావూరి సాంబశివరావు మరణం తీరని లోటని పేర్కొన్నారు. రాజకీయ, వ్యాపార రంగంలో కావూరిది ప్రత్యేక ముద్ర అని కొనియాడారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ కేంద్రమంత్రి, బీజేపీ నేత కావూరి సాంబశివరావు అనారోగ్యంతో కన్నుమూశారని తెలిసి విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఐదుసార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా వారు ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. రాజకీయంలో వారికున్న సుదీర్ఘ అనుభవంతో.. ప్రజాసమస్యలపై పార్లమెంటు లోపలా, బయటా తన గళాన్ని వినిపించారని ప్రశంసించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసి రాష్ట్ర ప్రగతి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తన నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. కావూరి సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మరణం పట్ల కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాసేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ధీశాలి కావూరి అని కొనియాడారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై నిరంతరం గళం వినిపించిన గొప్ప నాయకుడు కావూరి అని ప్రశంసించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు, ముఖ్యంగా బీజేపీ కుటుంబానికి తీరని లోటని భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మృతికి మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. కావూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పనబాక లక్ష్మి పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటని అన్నారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడు కావూరి అని కొనియాడారు. మచిలీపట్నం, ఏలూరు నుంచి 5 సార్లు ఎంపీగా గెలిచిన నిబద్ధత గల నేతను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని లగడపాటి రాజగోపాల్ తెలిపారు.

# అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజి (తరువాయి)

సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ మంటలు ఎగసిపడటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. : ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పైపులు, ఇతర సామగ్రి ఉండటంతో మంటలు అదుపు చేయడం కొంత కష్టంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు అగ్నిప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే భారీగా నిల్వ ఉంచిన పైపులు కాలిపోవడంతో ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయన్నదానిపై అధికారులు విచారణ ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణమా లేక ఇతర కారణాల వల్లా అగ్నిప్రమాదం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా పోలీసులు నిలిపివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చే వరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడే మోహరించి చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో వెలగపూడి ప్రాంతంలో



కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.

## అగ్ని ప్రమాదంపై విచారణ

అమరావతిలోని వెలగపూడి అగ్నిప్రమాదం ఘటనపై హోంమంత్రి అనిత విచారణకు ఆదేశించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేదా కుట్ర కోణం దాగి ఉందా? అనే అంశాలపై విచారణ చేపట్టాలన్నారు. ఘటనాస్థలంలో సమీప పొలం నుంచి మంట వచ్చిందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు చెప్పారు. పొలంలో గడ్డి పేర్చి నిప్పుపెట్టిన ఆనవాళ్లను చూపించారు. అమరావతిలో వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.

# అమెరికాలో రిలయన్స్ ఆయిల్ రిఫైనరీ

(మొదటి పేజి (తరువాయి)

ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ 'రిలయన్స్' కీలక భాగస్వామిగా చేరడం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. సుమారు 300 బిలియన్ల డాలర్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా అమెరికా-భారత్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన మరియు అత్యాధునికమైన రిఫైరీగా దీనిని తీర్చిదిద్దనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ డీల్ కుదుర్చుకున్నందుకు రిలయన్స్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాలకు గెలుపు లాంటిదని అభివర్ణించారు. ఈ భారీ ప్రాజెక్టు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా, అమెరికా ఇంధన భద్రతను గణనీయంగా పెంచనుంది. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, టెక్సాస్ ప్రాంత ఆర్థిక పురోగతికి ఇది కీలకం కానుంది. పర్యావరణ హితంగా ఉండేలా గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఇంధనాన్ని శుద్ధి చేయడం దీని ప్రత్యేకత. గతంలో పెట్రోలియం రంగంలో రిలయన్స్‌కు ఉన్న అపారమైన అనుభవం, ముఖ్యంగా జామ్‌నగర్ వంటి అతిపెద్ద రిఫైనరీల నిర్వహణ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ట్రంప్ యంత్రాంగం ఈ డీల్‌కు మొగ్గు చూపినట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందం వల్ల అమెరికా చమురు దిగుమతుల పై ఆధారపడటం తగ్గి, అంతర్జాతీయ మార్కెట్లో తన పట్టును మరింత బిగించే అవకాశం ఉంది. ఇది అమెరికాలో ఇంధన ఉత్పత్తిని పెంచి, బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని తీసుకువస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శుభ్రమైన శుద్ధి కర్మాగారంగా ఇది నిలుస్తుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికే 2024లో డల్లాస్ ప్రాంతానికి చెందిన స్టార్టప్ సంస్థ ఎలిమెంట్ ఫ్యూయల్స్ హోల్డింగ్స్ బ్రౌన్స్‌విల్లేలో దాదాపు 50 సంవత్సరాల తర్వాత పూర్తిగా కొత్త అమెరికన్ చమురు శుద్ధి కర్మాగారం నిర్మించేందుకు ప్రణాళికను తిరిగి ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే అమెరికా ఇంధన రంగంలో పెద్ద మార్పులు తీసుకురావడంతో పాటు భారత్-అమెరికా ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా



(మొదటి పేజి (తరువాయి)

గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోడీ అన్నారు. ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

## 17న శ్రీవారి ఆలయంలో

# కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల (తెలుగోడు), మార్చి 11 :**

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో 19న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని 17వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది ఉత్సవాలకు ముందు మంగళవారం కోయిల ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆపవాయితీగా వస్తోంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 16వ తేది ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.



అదేవిధంగా మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. ఈ కారణంగా 18వ తేది విఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరని టిటిడి తెలిపింది.

# హార్ముజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తతలు

## ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్,పలు నౌకలు ధ్వంసం

**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 11 :**

చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. దీంతో అవి ధ్వంసమయ్యాయి. తాము జరిపిన దాడుల్లో ఇరాన్ కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. జలసంధిలో పేలుడు సృష్టించడానికి ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలకు సమాచారం అందిందని ఆ దేశ మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. జలసంధి సమీపంలో ఇరాన్ ఎక్కడైనా మైన్స్‌ను అమర్చినట్లయితే.. వాటిని తక్షణమే తొలగించాలని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. లేదంటే పర్యవసానాలు చాలా తీవ్రంగా.. మునుపెన్నడూ చూడని స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ స్వయంగా వాటిని తీసేస్తే.. అది మంచి పరిణామం అన్నారు. లేదంటే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నౌకలను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన క్షిపణులను వాడి జలసంధిలోని మైన్‌లేయర్స్ పడవలను లక్ష్యంగా చేసుకుంటామన్నారు. ట్రంప్ హెచ్చరికల తర్వాత ఇరాన్ మైన్‌లేయర్స్‌ను ధ్వంసం చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడడంతో అవి ధ్వంసమయ్యాయి. తాము చేపట్టిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ క్రమంలనే దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది.ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేసేందుకు భారత్‌కు ఇచ్చిన అనుమతి వల్ల పుతిన్ సర్కార్‌కు పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని శ్వేతసౌధం ప్రకటించింది.

# ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

(మొదటి పేజి (తరువాయి)

తారలు, ప్రతిభావంతులైన దర్శకులు, నిర్మాతలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆస్కార్ వేదికపై భారతీయ నటి ప్రియాంక చోప్రా కూడా ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్‌వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి ప్రముఖ స్టార్స్‌తో కలసి ఆమె వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు.98వ అకాడమీ అవార్డ్స్ ఈనెల 15న ఆదివారం అమెరికా కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరగనున్నాయి. కాల వ్యత్యాసం కారణంగా భారతదేశంలో ఈ వేడుకలను మార్చి 16 సోమవారం వేకువ ఝామున 4:30 గంటల నుంచి వీక్షించవచ్చు. తారల తళుకులతో రెడ్ కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం మొదలవుతుంది. ప్రముఖ హాస్యనటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓ'బ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ ప్రేక్షకులు ఆస్కార్స్ వేడుకలను డిజిటల్, టెలివిజన్ ప్లాట్‌ఫామ్‌లలో వీక్షించవచ్చు. స్టార్ మూవీస్‌లో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఉదయం చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి ఈ వేడుకను పునః ప్రసారం చేయనున్నారు. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

# చంద్రబాబును సిఎంగానే భరించలేకున్నాం...

# ఇక ఉప ప్రధాని అయితే....

(మొదటి పేజి (తరువాయి)

కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందని జగన్ అన్నారు. భారీగా అప్పులు తీసుకుంటున్నప్పటికీ ఆ డబ్బు ప్రజల అభివృద్ధికి వినియోగం అవుతున్నదనే స్పష్టత కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రజల డబ్బును ఎలా ఖర్చు చేస్తున్నారో ప్రభుత్వం పారదర్శకంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రచార కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారని జగన్ విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాల కంటే రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకునే చర్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రజల జీవితాలను మెరుగుపరచే కార్యక్రమాలు చేపట్టాల్సిన సమయంలో ప్రభుత్వం వేరే దిశగా నడుస్తోందని వ్యాఖ్యానించారు.రాష్ట్ర అభివృద్ధి కోసం బాధ్యతాయుతమైన పాలన అవసరమని జగన్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, ప్రజలకు మేలు చేసే విధంగా పాలన కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రజలు గమనించాలని, ప్రజల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని జగన్ సూచించారు.

# అమెరికా ఆర్థిక సంస్థలపై దాడులు చేస్తాం..

(మొదటి పేజి (తరువాయి)

బ్యాంకులకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఒక కీలక బ్యాంకుపై ఇజ్రాయెల్ అర్ధరాత్రి దాడి చేసింది. ఈ ఘటనలో చాలా మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై తాము కూడా ఇలాగే అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడి చేస్తామని, అక్కడి ప్రజలు ఆ ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ తమ బ్యాంకులపై దాడి చేయడం ద్వారా తాము కూడా అలాంటి సంస్థలపై దాడులు చేసేందుకు తగిన కారణాన్ని ఇచ్చిందని ఇరాన్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ సహా గల్ఫ్ కంట్రీస్‌లోని అమెరికాకు చెందిన సంస్థలపై దాడులు చేసేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది. ఈ దాడులకు సంబంధించి అమెరికన్ సంస్థల టార్గెట్ లిస్టును ఇరాన్ ప్రకటించింది. ఇందులో ప్రముఖ అమెరికన్ టెక్ కంపెనీలు, ఇన్‌ఫ్రా కంపెనీలున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, పాలంటిర్, నివిడియా, ఒరాకిల్ వంటి సంస్థలున్నాయి. ఈ సంస్థలు గల్ఫ్ కంట్రీస్‌లో, ఇజ్రాయెల్‌లలో పలు ఆఫీసుల నుంచి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ ఒకరిపై ఒకరు చమురు సంస్థలు, ఆర్థిక కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసుకుంటున్నాయి. యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణా నిలిచిపోవడంతో ఇండియా, చైనా వంటి పలు ఆసియా దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి..

# మార్చి 28 నుంచి ఐపిఎల్ సందడి

(మొదటి పేజి (తరువాయి)

జరగనున్నాయి. అభిమానులకు ఆసక్తికరమైన పోటీలు చూడే అవకాశం లభించనుంది.మార్చి 30న ఢిల్లీలో ఢిల్లీ జట్టు, లక్నో జట్టు మధ్య మ్యాచ్ జరగనుంది. తదుపరి పోరు జైపూర్‌లో రాజస్థాన్ జట్టు, పంజాబ్ జట్టు మధ్య సాగనుంది. రెండు జట్లు తొలి విజయాన్ని సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాయి.మార్చి 31న హైదరాబాద్ మైదానం మరో కీలక మ్యాచ్‌కు వేదిక కానుంది. హైదరాబాద్ జట్టు, చెన్నై జట్టు మధ్య పోరు జరగనుంది. రెండు జట్లు బలమైన ఆటగాళ్లతో బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై భారీ ఆసక్తి నెలకొంది.ఏప్రిల్ 1న ముంబయిలో ముంబయి జట్టు, గుజరాత్ జట్టు మధ్య మ్యాచ్ జరగనుంది. తొలి వారంలోనే బలమైన జట్లు ఒకదానికొకటి ఎదురవుతున్న నేపథ్యంలో పాయింట్ల పట్టికలో ఆధిపత్యం సాధించేందుకు జట్లు తీవ్రంగా పోటీ పడనున్నాయి.ఈ విధంగా తొలి వారం నుంచే ఉత్కంఠభరిత పోటీలతో లీగ్ కొనసాగనుంది. ప్రతి జట్టు విజయంతో సీజన్ ప్రారంభించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుండటంతో అభిమానులకు ఆసక్తికరమైన మ్యాచ్‌లు చూడే అవకాశం లభించనుంది. దేశవ్యాప్తంగా మైదానాల్లో క్రికెట్ పండుగ వాతావరణం నెలకొననుంది.

# పెన్షన్లపై ఆరోపణలు అసత్యం

(మొదటి పేజి (తరువాయి)




నెల నెలా కొత్త పెన్షన్లు మంజూరు చేస్తుండగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని మాజీ ముఖ్యమంత్రి ఆరోపించడం బాధాకరమని పేర్కొన్నారు.గత పాలనలో రెండు వేల ఇరవై ఒకటి నుంచి రెండు వేల ఇరవై నాలుగు మధ్య కాలంలో పానీయాల సంస్థ నుంచి పదెనిమిది వేల నాలుగు వందల డెబ్బై రెండు కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు పదకొండు వేల నూట నలభై కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. పానీయాల సంస్థ నుంచి వచ్చే నిధుల వివరాలు ప్రభుత్వ బడ్జెట్ లో చూపించబడవని చెప్పారు.సామాజిక భద్రతా పెన్షన్ల కోసం రెండు వేల ఇరవై ఆరు నుంచి రెండు వేల ఇరవై ఏడు ఆర్థిక సంవత్సరానికి ఇరవై ఏడు వేల ఏడు వందల పందొమ్మిది కోట్ల రూపాయలను బడ్జెట్ లో ప్రతిపాదించినట్లు మంత్రి తెలిపారు. పెన్షన్లకు అవసరమైన మరో ఐదు వేల ఏడు వందల అరవై ఆరు కోట్ల రూపాయలను పానీయాల సంస్థ నుంచి తీసుకుంటామని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి

## గుత్తి కోట ఉత్సవాలు జయప్రదం చెయ్యండి

**గుత్తి (తెలుగోడు), మార్చి 11 :**
గుత్తి కోట ఉత్సవాలు జయప్రదం చెయ్యాలని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గుత్తి పట్టణంలో బుధవారం జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి వై రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్లో గుత్తి పట్టణంలో కోట వద్ద జరిగే ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. 101 బావులు, రెండువేల సంవత్సరాల చరిత్ర, 18 కిలోమీటర్ల కోటగోడ, రాణివాసం, గుర్రపు, ఏనుగు శాలలు, పురాతన దేవాలయాలు, ధాన్యాగారం, రంగమండపం గుత్తి కోటలో ఉన్నాయన్నారు. అందరూ గుత్తి కోట చరిత్ర తెలుసుకొని పురాతన కట్టడాలను వీక్షించాలన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించి కోట అబివృద్ధి పరచాలన్నారు. ఉత్సవాల సందర్భంగా కోటకు వచ్చే అతిథులను కోట పైకి కనీసం గుర్రపుశాల వరకు తీసుకుపోవడానికి ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ తహసిల్దార్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. గుత్తి పట్టణ మండల ప్రజలందరూ ఉత్సవాలలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ రంగారెడ్డి, మధుబాబు, ఓబులప్ప, సుభాష్ రెడ్డి, రామాంజులు , తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ కలిసిన కోట సంరక్షణ సమితి సభ్యులు

## మున్సిపాలిటీ దినసరి మార్కెట్ వేలం రద్దు చేయాలి

**కమిషనర్‌కు వినతి..**

**గుత్తి (తెలుగోడు), మార్చి 11 :**
గుత్తి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ అధికారులు రెండు రోజుల క్రితం నిర్వహించిన దినసరి మార్కెట్ వేలం రద్దు చేయాలని కోరుతూ బుధవారం గుత్తి మండల జనసేన నాయకులు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియాకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ అధికారులు స్థానిక టిడిపి నాయకులు లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని దినసరి మార్కెట్ వేలం విషయాన్ని పెద్దగా ప్రజలకు తెలియనీయకుండా మున్సిపల్ కార్యాలయంలోని ఏకపక్షంగా నిర్వహించి టిడిపి నాయకులకు అప్పగించారన్నారు. ప్రభుత్వ అధికారులు స్థానిక నాయకుల కారణంగా మున్సిపల్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోందని వారు విమర్శించారు. రెండు రోజుల క్రితం నిర్వహించిన వేలాన్ని రద్దుచేసి తిరిగి ప్రజలకు పెద్ద ఎత్తున సమాచారం చేరవేసే విధంగా ప్రచారం నిర్వహించి అనంతరం బహిరంగబలం నిర్వహించాలని నాయకులు మున్సిపల్ కమిషనర్ సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన గుత్తి మండల నాయకులు పోతురాజు చిన్న వెంకటేశం పాటిల్ సురేష్ బోయగడ్డ బ్రహ్మయ్య మిద్దె ఓబులేసు వెంకటపతి నాయుడు తో పాటు పలువురు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు




మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

## పిన్నేపల్లి ఎస్సీ కాలనీలో నీటి సమస్య తీర్చాలి

**డిప్యూటీ ఎంపీడీవో కు వినతి పత్రం.**
**ఎమ్మార్పీఎస్ కార్యదర్శి దేవరాజ్..**

**యాడికి (తెలుగోడు), మార్చి 11 :**
యాడికి మేజర్ పంచాయితీ పరిధిలోని పిన్నేపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ తాడిపత్రి నియోజకవర్గ కన్వీనర్ దేవరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ ఎంపీడివో శశికళకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో నీటి కొరత ఉందన్నారు. స్పందన కార్యక్రమాల్లో, ఎంపీడీవో కార్యాలయంలో అనేకసార్లు వినతిపత్రం ఇచ్చామన్నారు. అయితే వాటికి సంబంధించి కొన్ని నెలల కిందట గండికోట పైప్‌లైన్‌ని పిన్నేపల్లికి ఏర్పాటు చేశారని, కానీ ఎలాంటి మార్పు లేదన్నారు. గండికోట లైన్ వేశారు కానీ రోజుకు ఒక గంట కూడ నీటిని వదలడం లేదన్నారు. ప్రతి సంవత్సరం వేసవి కాలం మొదలుకాగానే పిన్నేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసుల పరిస్థితి నీటి కోసం ఎదురుచూడమేనా అని అన్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామస్థాయిలో పరిశీలించి గతం నుంచి ఉన్న నీటి పైపులైను మరమ్మతులు చేయించి అలాగే పైప్లైన్లకు ఇప్పుడు కొత్తగా వేసిన గండికోట పైపులు కనెక్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యాడికి మండల గౌరవ అధ్యక్షులు వెంగళ శ్రీనివాసులు , ఎమ్మార్పీఎస్ యాడికి మండల ఉపాధ్యక్షులు చుట్ట నల్లప్ప , ఎమ్మార్పీఎస్ యాడికి మండల ప్రధాన కార్యదర్శి జానకి రాముడు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ ఎంపీడీవో శశికళకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరాజ్.శ్రీనివాసులు

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**బెళుగుప్ప లో పప్పుశెనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం..**
**టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున,.**
**ఎంపీపీ పెద్దన్న..**
**పిఎసిఎస్ ఛైర్మన్ కంచిరాముడు..**

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 11 :**
రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టిడిపి జిల్లా నాయకులు మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన బెళుగుప్ప లో ప్రభుత్వం రైతులు పండించిన పప్పు సెనగ పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ఏపీ మార్క్ఫెడ్ వారి ఆధ్వర్యంలో పప్పు శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని, టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున ఎంపీపీ పెద్దన్న పీఏసీఎస్ ఛైర్మన్ కంచి రాముడు ముఖ్య అతిథులుగా పాల్గొని పప్పు శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని మండల వ్యవసాయాధికారి పృథ్వీ సాగర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నాయకులు మల్లికార్జున, ఎంపీపీ పెద్దన్న, పిఎసిఎస్ ఛైర్మన్ కంచి రాముడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను అన్ని విధాలుగా



బెళుగుప్పలో పప్పు సెనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి జిల్లా నాయకులు మల్లికార్జున, ఎంపీపీ పెద్దన్న, పిఎసిఎస్ ఛైర్మన్ కంచరాముడు, తదితరులు



బెళుగుప్పలో పప్పు సెనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి జిల్లా నాయకులు మల్లికార్జున, ఎంపీపీ పెద్దన్న, పిఎసిఎస్ ఛైర్మన్ కంచరాముడు, తదితరులు

ఆదుకుంటుందని వారు పేర్కొన్నారు. పంటల సాగు సమయంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందిస్తూ, పంటలు పండించిన తరువాత వాటిని మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. క్వింటాల పప్పు సెనగ మార్కెట్ లో 5000 రూపాయలు ఉంటే ప్రభుత్వము మార్క్ఫెడ్ ద్వారా 5875 రూపాయలతో కొనుగోలు చేస్తుందన్నారు.అనంతరం మండల వ్యవసాయ అధికారి పృథ్వీ సాగర్ మాట్లాడుతూ పప్పు శనగ క్వింటాలుకు 5875 రూపాయలకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ముందుగా వారి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న రైతు మొబైల్ కు కొనుగోలు చేసే పంట వివరములు అందిన పిమ్మట పంటను తీసుకురావాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు రైతుల బ్యాంకు ఖాతాలోకి వారం నుంచి పది రోజుల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసి పప్పు సెనగ విత్తనాలలో తేమశాతం 14శాతం లోపల ఉండాలని , ఇతర వ్యర్థ పదార్థాలు 1శాతం లోపు , ఇతర గింజలు 3శాతం లోపు, దెబ్బతిన్న గింజలు 3శాతం లోపు , ఉండాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున ఎంపీపీ పెద్దన్న, ఏసిఎస్ ఛైర్మన్ కంచిరాముడు, మెంబర్ లు ఈశ్వర్,లక్ష్మీబాయి, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు,ఏపీ మార్క్ఫెడ్ సిబ్బంది చెన్నకేశవులు, వెంకటరామిరెడ్డి వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**ఫయాజ్ బాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో**

# నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ

**మరోసారి దాతృత్వం చాటుకున్న ఫయాజ్ బాషా..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 11 :**
స్థానిక పడమటి గేరిలోని హీరాపురం ఫయాజ్ బాషా నివాసంలో బుధవారం ఫయాజ్ బాషా ట్రస్ట్ అధ్యక్షుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హీరాపురం ఫయాజ్ బాషా నిరుపేద ముస్లిం మహిళలకు రంజాన్ కానుకగా చీరలను పంపిణీ చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇటీవలే మౌజన్‌లు, ఇమామ్‌లకు లక్షలాది రూపాయలను రంజాన్ తోఫాగా అందజేసిన హీరాపురం ఫయాజ్ బాషా వారం రోజుల్లోపే నిరుపేద మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేయడం ఆయన దాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. నిరుపేదలు ఆపదలో ఉన్నప్పుడు ఫయాజ్ బాషా సేవా ట్రస్ట్ ద్వారా సహాయం అందిస్తూ, తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన ఫయాజ్ బాషా ప్రజల నడుమ ప్రజా నాయకుడిగా నిలుస్తున్నారని స్థానికులు కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా ఫయాజ్ బాషా మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని తమ 5వ నెంబర్ బీడి ఫ్యాక్టరీకి చెందిన 15 బ్రాంచ్‌లలో పని చేసే బీడి కార్మికులు, అలాగే కుల, మత భేదాలు లేకుండా నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం తమ కుటుంబంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న



చీరల కోసం బారులు తీరిన మహిళలు

సంప్రదాయమని తెలిపారు. వ్యాపారంలో వచ్చిన లాభంలో 30 శాతం భాగాన్ని ప్రజాసేవ కోసం వినియోగిస్తూ, ఫయాజ్ బాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ రంజాన్ మాసంలో సుమారు 1800 మంది నిరుపేద మహిళలకు చీరలు, 200 మంది పురుషులకు ప్యాంట్, షర్ట్, జుబ్బా, పంచలు రంజాన్ తోఫాగా పంపిణీ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు షాషావలి, షేక్షా, నూర్, జునైద్, సూరి తదితరులు పాల్గొన్నారు.




మహిళలకు రంజాన్ కానుకగా చీరలు పంపిణీ చేస్తున్న ఫయాజ్ బాషా

# క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలకం

**ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి..**


**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 11 :**
మహిళల్లో కనిపించే క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీవ్యాక్సిన్ ఎంతో కీలకమని తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన, టీకా ప్రత్యేక డ్రైవ్‌లో కార్యక్రమంలో శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 14-15 సంవత్సరాల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాలు ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించినట్లు తెలిపారు. మహిళల్లో కనిపించే క్యాన్సర్‌ను ముందుగానే నివారించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకా ప్రాముఖ్యత గురించి వివరించి, బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆదాని సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో క్షయవ్యాధి బాధితులకు ఆరు నెలల పాటు పౌష్టికాహారం కిట్, కోడిగుడ్లు అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డేవిడ్, ఆదాని సిమెంట్ ఇన్ ఛార్జ్ రామరాజు, మునిసిపల్ వైస్ ఛైర్మన్ షేక్షావలి, కౌన్సిలర్లు విజయ కుమార్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి




క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి
క్షయ వ్యాధిగ్రస్తులకు కోడిగుడ్ల ట్రే అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా

## గుత్తి కోట ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

**గుత్తి (తెలుగోడు), మార్చి 11 :**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈనెల 14,15 తేదీలలో జరగనున్న గుత్తి కోట ఉత్సవాల నిర్వహణపై మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో గుత్తి మునిసిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా మెప్మా పిడి విశ్వజ్యోతి మాట్లాడుతూ గుత్తి కోట ఉత్సవాలలో మహిళా సంఘాల సభ్యులను హాజరయ్యేలా ఆర్‌పిలకు అదేశాలు జారీ చేశారు. మెప్మా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. గుత్తి కోట ఉత్సవాలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కమీషనర్ బి.జబ్బార్ మియా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైవుల్ వుడ్ స్పెషలిస్ట్ వాసుదేవరెడ్డి, మెప్మా ఐ.బి భవాని, మెప్మా టి.ఎం.సి లు శ్రీనివాసరెడ్డి, చంద్ర శేఖర్, సి.ఓ షరీఫ్, మెప్మా సిబ్బంది, ఆర్.పిలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

## ఘనంగా ఈటె స్వామిదాసు జన్మదిన వేడుకలు

**కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 11 :**
అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామి దాసు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వడ్డే నారాయణ, ఫిరోజ్, కార్పొరేటర్ బాలాంజనేయులు, పాస్టర్ కృపాదాసు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పెండేకల్లు డ్యాంనుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

## పెండేకల్లు డ్యాం నుంచి నీటి విడుదల


**ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 11 :**
పెద్ద పప్పూరు మండలం పెండేకల్లు డ్యాం నుంచి బుధవారం సాగునీటిని శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి విడుదల చేయించారు. వేసవి కాలం మొదలుకాగానే, మార్చి నెల మొదట్లోనే బోర్లల్లో నీరు అట్ట అడుగుకు పోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో విషయం తెలుసుకున్న శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి కాలువలలో హిటాచీ, జేసిబి, ట్రాక్టర్ల సాయంతో పూడిక తీత తీయించారు. పెద్ద పప్పూరు మండలం పెండేకళ్ళు డ్యాం నుంచి నీటిని విడుదల చేయుంచడంతో రామాపురం, బందార్లపల్లి, బ్రాహ్మణపల్లి, జోగినాంపల్లి, గంగాదేవిపల్లి, వరదాయపల్లి, చుక్కలూరు గ్రామాల రైతులకు ఊరటనిచ్చింది. సాగునీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మండల వైఎస్సార్సీపీ పార్టీ కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి**

**కనేకల్ (తెలుగోడు), మార్చి 11 :**
పట్టణంలో నిర్వహించనున్న వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్రెడ్డి విగ్రహం వద్ద సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మైస్సార్సీపీ 15 సంవత్సరాలు పూర్తి చేసుకొని 16వ సంవత్సరంలో అడుగు పెడుతోందన్నారు. పేద, నిరుపేద ప్రజలకు మేలు చేయడంతోపాటు ప్రజల పక్షాన నిలబడేందుకు జగన్మోహనరెడ్డి పార్టీ పెట్టారన్నరు. ఈ పార్టీ ప్రతి ఒక్కరి కోసమని నిరుపేదల కోసమే అని రాజశేఖర్ రెడ్డి ప్రజలకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మండల కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి కోరారు.



## రైతులకు అందుబాటులో యూరియా

*సింగిల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్ ..*

**అమరాపురం (తెలుగోడు), మార్చి 11**



అమరాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూరియా రైతులకు అందుబాటులో ఉందని మండల సింగిల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ 12.6 టన్నుల యూరియా వచ్చిందన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులను తీసుకువెళ్ళవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దాదు ధనుంజయ పాల్గొన్నారు.

## నేడు వైకాపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

*మండల కన్వీనర్ త్రిలోక్నాథ్..*

**అమరాపురం (తెలుగోడు), మార్చి 11**

అమరాపురం వైయస్సార్ విగ్రహం వద్ద వైయస్సార్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ త్రిలోక్ నాథ్ పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ఉషశ్రీ చరణ్ , హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి , నియోజకవర్గ అబ్జర్వర్ రఘునాథ్ రెడ్డి , రాష్ట్ర ఎస్. ఇ. సి. కౌన్సిల్ సభ్యులు మరియు మండల పరిశీలకులు వైసీ గోవర్ధన్ రెడ్డి , శ్రీరాములు , కామరాజు హాజరవుతారన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ .ఎల్. ఈరలకప్ప ఆధ్వర్యంలో అమరాపురం పట్టణంలో ఉన్న వైయస్సార్ విగ్రహం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. మండలంలోని రాష్ట్ర స్థాయి నాయకులు ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు 11 పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి పంచాయతీల కన్వీనర్లు, పంచాయతీల కమిటీ సభ్యు లు, పంచాయతీ కమిటీ కన్వీనర్లు పంచాయతీల అనుబంధ కమిటీ సభ్యులు పంచాయతీ పరిధిలోని సీనియర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



## బాలల హక్కుల కమిషన్ బోర్డు సభ్యుడికి ఘన సన్మానం

*మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎంఆర్ శివరాములు*

**అగళి (తెలుగోడు), మార్చి 11 :**

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బోర్డు సభ్యులుగా నియమితులైన డాక్టర్ శ్రీనివాస మూర్తిని ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎం ఆర్ శివరాములు మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా వారికి శాలువా కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఒక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ సింగల్ విండో అధ్యక్షులు మండల కన్వీనర్లు క్లస్టర్ ఇంచార్జిలు తదితర నాయకులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీనివాస మూర్తిని సన్మానిస్తున్న దృశ్యం




వివరాలు వెల్లడిస్తున్న మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్

## రైతన్నల ఖాతాల్లోకి రూ.4.96 కోట్లు జమ

*ఏవో అబ్దుల్ హక్..*

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 11**

నల్లమాడ మండలంలోని రైతన్నల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ద్వారా రూ 4.96 కోట్లు జమ కానున్నట్టు మండల వ్యవసాయ అధికారి అబ్దుల్లాహ్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించనుంది. మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన 8,490 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.4,000 చొప్పున మొత్తం రూ.3.40 కోట్లు జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే పీఎం కిసాన్ పథకానికి అర్హులైన 7,838 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున మొత్తం రూ.1.57 కోట్లు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు పథకాల కింద కలిపి మొత్తం రూ.4.96 కోట్లు మూడో విడతగా మార్చి 13, 2026న నల్లమాడ మండలంలోని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన రైతులు తమ బ్యాంకు ఖాతాలను పరిశీలించుకోవాలని, ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ వివరించారు.

# కూటమి నాయకుల ఆధిపత్య పోరు అభివృద్ధి పనులకు అడ్డు!

### రూ.50 లక్షల మండల గ్రాంటు వెనక్కి వెళ్లే ప్రమాదం.. గ్రామాల్లో కక్షలకు అధికారుల ఆజ్యం .. ఎంపీపీ బగ్గిరి త్రివేణి ..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 11**

మండలంలో కూటమి నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు అభివృద్ధి పనులకు అడ్డంకిగా మారిందని మండల పరిషత్ అధ్యక్షురాలు బగ్గిరి త్రివేణి ఆరోపించారు. ఈ పరిస్థితుల వల్ల మండల గ్రాంటు కింద విడుదలైన రూ.50 లక్షల నిధులు వినియోగం కాకుండా వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బుధవారం బత్తలపల్లి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్తుకు ఆరు నెలలకు ఒకసారి మండల గ్రాంటు విడుదల అవుతుందని తెలిపారు. ఆ నిధులను మండలంలోని వివిధ అభివృద్ధి పనులకు వినియోగించాలని నిర్ణయించినట్లు చెప్పారు.అయితే కూటమి నాయకుల మధ్య ఉన్న విభేదాల కారణంగా తమ సర్పంచులు, ఎంపీటీసీలు పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వారిలో ఎవరు పని చేయాలో కూడా నిర్ణయించుకోలేకపోవడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు.అప్పరాచెరువు పంచాయతీలో అధికారులే కక్షలకు ఆజ్యం పోస్తున్నారని ఎంపీపీ విమర్శించారు. పంచాయతీలో నిధులు లేవని చెప్పిన అధికారులు తరువాత నిధులు ఉన్నాయని రిజల్యూషన్ ఇవ్వడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు.తమకు కూడా అదే విధంగా రిజల్యూషన్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు.రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే బత్తలపల్లి పంచాయతీలో డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి మాట్లాడుతూ అనంతసాగరం, డి.చెర్లోపల్లి, కాటమకుంట గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా సత్యసాయి వాటర్ సరఫరా అధికారులతో మాట్లాడి అదనంగా నీరు అందించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ స్వర్ణలత, వైస్ ఎంపీపీలు సాకే పార్వతి, గజ్జల వెంగళరెడ్డి, సర్పంచులు మాదిరెడ్డి పద్మావతమ్మ, ప్రభాకర్ రెడ్డి, చల్లా కరుణాకర్ నాయుడు, అఖిల్ దామోదర్, బండి సరస్వతి,ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్ కుమార్, తప్పేట ఆంజనేయులు, కో ఆప్షన్ మెంబర్ కరీంషాబ్, ఏవో ఓపిరెడ్డి, ఎంఈఓ చాముండేశ్వరి, వైద్యాధికారి అరుణ్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ జ్యోతి, పశు వైద్యధికారి గుర్నాథ్ రెడ్డి , ట్రాన్స్కో ఎఇ శివయ్య, ఐకెపి ఎపిఎం హరిప్రసాద్, ఏపీవో నాగేంద్ర, దేవాలయ శాఖ అధికారిని నాగరత్నమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



బత్తలపల్లి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

## సాయంత్రంలోపు తాగునీటి సమస్య పరిష్కారం కావాలి

### జడ్పిటిసి ఉమేష్ ..

**అగళి (తెలుగోడు), మార్చి 11 :**

బుధవారం సాయంత్రంలోపు వద్రహట్టి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కావాలని స్థానిక నాయకులు రాజన్నకు జడ్పిటిసి ఉమేష్ తెలియజేశారు. మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు బుధవారం అగళి జడ్పీటీసీ ఉమేష్ అగళి మండలం హెచ్డి హళ్లి పంచాయతీ వద్రట్టి లో త్రాగునీరు సమస్య ఉందని తెలుసుకున్న జడ్పిటిసి ఉమేష్ వెంటనే అక్కడికి వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్య తెలుసుకొని ఈ రోజు కచ్చితంగా నీరు వస్తాయి అని ఆగ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు,అలాగే అక్కడే ఉన్న వాటర్ ట్యాంక్ ను శుభ్రం చేయించారు. సాయంత్రం లోపు బోరు మరమ్మత్తు చేయించి నీటి సమస్య అనేది లేకుండా చేయాలని స్థానిక నాయకులకు పంచాయతీ కార్యదర్శి జీవన్ కు తెలియజేశారు.కార్యక్రమం లో జడ్పిటిసి ఉమేష్ వెంట కల్చరల్ సెల్ అధ్యక్షుడు రాజన్న, పంచాయతీ అధ్యక్షుడు రఘు,పంచాయతీ సెక్రటరీ జీవన్ ,లైన్ మెన్ మహేష్,కృష్ణ నాయక్, గ్రామ ప్రజలునాయకులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న జడ్పిటిసి ఉమేష్



వాటర్ స్టోరేజ్ ట్యాంకును శుభ్రం చేయిస్తున్న జెడ్పిటిసి ఉమేష్

## మట్టి నమునాల సేకరణ, మట్టి ఆరోగ్య పత్రంపై అవగాహన

### మండల వ్యవసాయ అధికారి నాగరాజు..

**అగళి (తెలుగోడు), మార్చి 11 :**

మండల కేంద్రంలోని పి యం శ్రీ ఆదర్శ పాఠశాల జూనియర్ కాలేజ్‌లో బుధవారం విద్యార్థులకు మట్టి నమూనా సేకరణ మట్టి ఆరోగ్య పత్రంపై మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఉపాధ్యాయులతో కలిసి అవగాహన కల్పించారు. అందులో భాగంగా మట్టి నమూనాలు ఏ విధంగా తీయాలి, మట్టి పరీక్ష, మట్టి ఆరోగ్యపత్రం ఉపయోగాలు కూడా విద్యార్థులకు చాలా వివరంగాతెలియజేశారు అలాగే విద్యార్థులు రైతుల నుంచి 50 మట్టి నమూనాలు సేకరణ చేసి మట్టి పరీక్ష కేంద్రానికి పంపించాలని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఆదర్శ కళాశాల ప్రిన్సిపల్ విజయ కుమారి,ఉపాధ్యాయులు రైతు సేవ కేంద్ర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



మట్టి నమూనాపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి నాగరాజు

## నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు జలబాట

### గ్రామాల్లో తాగునీటి పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు సమస్యాత్మక గ్రామాల్లో పర్యటన .. అక్కడికక్కడే పరిష్కారం..

**రొళ్ల (తెలుగోడు), మార్చి 11**

తాగునీటి సమస్య ఉన్న గ్రామలే లక్ష్యంగా ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు జలబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తూ, కొడగార్లగుట్ట గ్రామం లో ఓ రైతు బోర్ నుంచి పైప్ లైన్ ద్వారా తాత్కాలికంగా నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. హనుమంతనపల్లి, బిజీ హళ్లి హై స్కూల్, కొడకార్లగుట్ట కొత్తపాళ్యం తాండ, పాఠశాల రత్నగిరి , రంగనపల్లి, వెంకటమ్మనపల్లి, పలు గ్రామాల్లో ఆకస్మిక పర్యటన చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను స్వయంగా పరిశీలించి, అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పలు సమస్యలకు తక్షణ పరిష్కారం చూపారు.గత ఐదేళ్ల వైసీపీ నిర్లక్ష్య పాలనలో అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గం లో కూటమి ప్రభుత్వంలో ప్రగతి పథంలో దూసుకెళ్లుతుంది.ఈ అభివృద్ధిని ఓర్వలేని కొందరు పనిగట్టుకుని సృష్టిస్తున్న కుట్రపూరిత, అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. మీ సేవకుడిగా తన కార్యాలయం తలుపులు, నా మొబైల్ మీకు 24 గంటలూ అందుబాటులోనే ఉంటాయి. మీకు ఏ కష్టం వచ్చినా.. సమస్యను ఒక చిన్న మెసేజ్ ద్వారా నా దృష్టికి తీసుకురండి, తక్షణమే స్పందిస్తానని తెలియజేశారు. గ్రామాలలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను రోడ్ల పనులను పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ వివిఎం పాండురంగప్ప, మండల కన్వీనర్లు జి కె ఈరన్న, కుమార్ స్వామి, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, ఏపీఐసి డైరెక్టర్ రామక్రిష్ణ, ఆర్ డబ్ల్యూ ఎస్ డి ఇ మాను నాయక్, ఏ ఓ ఆర్ డి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, నరసేగౌడ్, ఎ.ఇ. నరేష్ గౌడ్,క్లస్టర్ ఇంచార్జ్ మంజునాథ్, మాజీ క్లస్టర్ ఇంచార్జ్ భరత్,క్లస్టర్ కో కన్వీనర్ మారుతి,మండల తెలుగు యువత అధ్యక్షులు హేమంత్,యువ నాయకులు ఆనంద్, బాలకృష్ణ,మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి,యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, పంచాయతీ అధ్యక్షులు శ్రీనివాస్, దొడ్డరప్ప, నాగేంద్ర, నాయకులు రవికుమార్, రంగప్ప,శ్రీరంగప్ప,తదితరులు పాల్గొన్నారు.



కొడగార్లగుట్ట గ్రామంలో నీటి సమస్యపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు



చింతపండు శుభ్రపరస్తున్న కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు. రత్నగిరి ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



సమావేశమైన వైఎస్ఆర్సిపి అనుబంధం సంఘాల కమిటీ నాయకులు

## వైయస్ జగన్మోహన్ రెడ్డిని సీఎంగా మళ్లీ గెలిపించుకుందాం

*వైసీపీ పట్టణ అధ్యక్షుడు బాల్ రెడ్డి..*

**ధర్మవరం (తెలుగోడు), మార్చి 11**

సీఎంగా వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని వైసీపీ పట్టణ అధ్యక్షుడు బాల్ రెడ్డి అన్నారు. ధర్మవరం పట్టణంలోని 22వ వార్డు సాయినగర్ లో బుధవారం వైసిపి అనుబంధ సంఘాల కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వార్డ్ పరిశీలకుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్సీపి పార్టీ సంస్థాగత నిర్మాణంలో బాగంగా పార్టీ కోర్ కమిటీతో పాటు వివిధ అనుబంధ విభాగాలలో నియామకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసీపీ పట్టణ అధ్యక్షుడు కోటిరెడ్డి బాల్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సూచనలతో వైసిపి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా మనం అందరం ఇప్పటి నుంచే కష్టపడి ప్రజల్లో తిరుగుతూ పార్టీని ప్రజలకు మరింత చేరువచేసే దిశగా అందరూ కలిసి పనిచేయాలన్నారు. వైసిపి పార్టీ కోసం కష్టపడే కార్యకర్తకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలు, సాధారణ ఏ ఎన్నికల్లో నైనా వైసిపి పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేద్దాం అని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణం పై అందరూ క్రియాశీలకంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు బాల్ రెడ్డి, వైసీపీ నాయకులు కత్తే పెద్దన్న, ఆటో ప్రసాద్, కొండపల్లి శివ, పెద్దారెడ్డి శ్రీనివాసులు, చౌడప్ప, వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బాల్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న నియోజకవర్గ నాయకులు

## రొళ్ల కే.జి.బివిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

*ప్రిన్సిపాల్ మున్వర్ జాన్..*

**రొళ్ల (తెలుగోడు), మార్చి 11**

సమగ్ర శిక్ష-ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కే.జి.బి.వి (కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో) 2026-27 విద్యాసంవత్సరంలో ఆరవ తరగతి, 11 వ తరగతి (ఇంటర్ మొదటి సంవత్సరం)లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థిని ల నుండి దర్శిస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మున్వర్ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 వ తరగతి లో 40 సీట్ లకు 11 తరగతుల్లో 40 సీట్ లను భర్తీ చేయనునట్లు తెలిపారు. సీట్ల భర్తీ కోసం ఆన్లైన్లో దరఖాస్తులు పూరించాలని,12-03-2024, నుంచి 01-04-2024 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మధ్యలో మానివేసిన పిల్లలు , “నిరుపేద్ (బి.పి.ఎల్) ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనారిటీ, బి.పి.ఎల్ వర్గాలకు చెందిన విద్యార్థినిలు మాత్రమే దరఖస్తు చేసుకోవాలన్నారు. ఏపీకేజీబివి . ఏపీసీఫస్ .ఇన్ అనే వెబ్ సైట్ ద్వారా సమర్పించాలన్నారు. కేవలం ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే ప్రవేశాలకు పరిగణించ బడతాయాన్నారు ఎంపికైన విద్యార్థులకు మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. 6 వతరగతి ప్రవేశానికి తప్పనిసరిగా ప్రభుత్వ బడిలోకాని ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన పాఠశాలలో 5 వతరగతి చదివిన బాలికలై ఉండాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలకు 10 వతరగతి ఉతీర్ణత సాదించాల్సి ఉంటుందని తెలిపారు. 12 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: 01.04.2026 దరఖాస్తులకు చివరి తేదీ అన్నారు. ఎంపిక జాబితా తయారీ (స్కూల్ లెవల్) ఏప్రిల్ ఆరు నుంచి , జాబితా వెరిఫికేషన్ ఏప్రిల్ 2న జరుగుతుందన్నారు. ఏప్రిల్ 1 నుంచి 8 వరకు ప్రవేశాల ధ్రువీకరణ (సర్టిఫికెట్ వెరిఫికేషన్ ) 13 నుండి 17 వరకు ఇంటర్మీడియట్ జాబితా ఎస్ఎస్సి ఫలితాల విడుదల అనంతరం ప్రకటించబడుతుందన్నారు. మొత్తం 40 సీట్లకు కేటగిరి వారిగా ఓపెన్ కాంపిటీషన్ (ఓసీ - ఆల్ కమ్యూనిటీస్ ) 50 శాతం 15 సీట్లు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ)15 శాతం 5 సీట్లు, షెడ్యూల్డ్ తెగలు (గా) 6 శాతం 2 సీట్లు, వెనుకబడిన తరగతులు (బిసి -ఎ)7 శాతం 2 సీట్లు, వెనుకబడిన తరగతులు (బిసి - బి ) 10 శాతం 3 సీట్లు, వెనుకబడిన తరగతులు (బిసి - డి) 7 శాతం 2 సీట్లు, వెనుకబడిన తరగతులు (బిసి - ఇ ) 4 శాతం 1 సీటు ప్రాధాన్యత వర్గాలు (ఓ ఎస్ సి , ఆరఫాన్స్ , పీహెచ్ సి మొదలైనవి) 10 సీట్లు ఉన్నాయన్నారు.



## నేడు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

*జడ్పీటీసీ అనంతరాజు..మండల ఎంపీపీ సుమ..మండల కన్వీనర్ నరసింహారెడ్డి..*

**రొళ్ల (తెలుగోడు), మార్చి 11**



:వైఎస్సార్ సీపీ 15వసంతాలు పూర్తి చేసుకొని 16వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో గురువారం మండలకేంద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 11:30 గంటలకు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకొంటున్నట్లు జడ్పీటీసీ అనంతరాజు, మండల ఎంపీపీ సుమ, మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో గడిచిన 15 ఏళ్ళలో ఎన్నో సవాళ్ళను అధిగమించి, నాడు ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించిన వైనం రాష్ట్ర చరిత్రలో చెరగని ముద్రవేసారన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలకప్ప ఆధ్వర్యంలో రోళ్ళ రోళ్ళ పట్టణంలో ఉన్న వైయస్సార్ విగ్రహం దగ్గర పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని రాష్ట్ర స్థాయి నాయకులు జడ్పీటీసీ, ఎంపీపీ,వైస్ ఎంపీపీలు ఎంపీటీసీలు సర్పంచులు, 10 పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి పంచాయతీల కన్వీనర్లు పంచాయతీల కమిటీ సభ్యు లు పంచాయతీ కమిటీ కన్వీనర్లు పంచాయతీల అనుబంధ కమిటీ సభ్యులు పంచాయతీ పరిధిలోని సీనియర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.





# ఎస్ఐ నిరంజన్ రెడ్డి సేవలు మరువలేనివి



సమతా సైనిక్ దళ్ నేత రంగయ్య

## ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

*సమతా సైనిక్ దళ్ నేత రంగయ్య*

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 11 :**
గత ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సమతా సైనిక్ దళ్ నేత రంగయ్య అన్నారు. ఎమ్మిగనూరులో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంగయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం అరాచకాలు, తప్పిదాలు, మోసాలను ప్రశ్నించిన వేలమందిపై వైసీపీ ప్రభుత్వం అక్రమకేసులను పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయినా ఈ దిశగా ఆలోచించకపోవడం బాధాకరం అన్నారు. ఈ కేసులలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల దళితులే ఎక్కువగా ఉన్నారన్నారు. ఇప్పటికి చేయని నేరానికి వేలమంది జైళ్లలో మగ్గుతున్నారన్నారు. కొంతమంది అట్టడగు వర్గాల దళితులపై రౌడీ షీట్లు ఓపెన్ చేయడం దుర్మార్గం అన్నారు. దీంతో వారి పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగాలకు భవిష్యత్‌కు చాలా ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానాలను ఆశ్రయించే ఆర్థిక స్తోమత లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. శాసనసభ్యులు ఈ విషయంపై అధిష్టానంపై వత్తిడి చేయాలన్నారు. లేని పక్షంలో ప్రత్యక్ష పోరాటానికి సమతా సైనిక్ దళ్ సిద్ధమవుతుందన్నారు.

## ఎస్‌బిఐ మేనేజర్‌ను కలిసిన ఐహెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ టి ఆంజనయ్య

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 11 :**
ఎమ్మిగనూరు ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్‌లో బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రవి కళాధర్ శర్మని ఐహెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ టి ఆంజనయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. సంస్థ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజల ఖాతాలు, డిపాజిట్లు, రుణాల విషయాల్లో ఇబ్బందులు తలెత్తితే సత్వరం పరిష్కరించాలని అన్నారు. దానికి అయన సానుకూలంగా స్పందించారు. బ్రాంచ్‌లో సిబ్బంది ఖాతాదారులకు అందుబాటులో ఉంటూ సహకరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం క్యాలెండర్లను అందించారు.



ఐహెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ టి ఆంజనయ్యకు క్యాలెండర్ అందిస్తున్న ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ రవి కళాధర్ శర్మ



దివ్యాంగ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన డిఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

## దివ్యాంగులకు ఇఫ్తార్ విందు

*డిఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు..*

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 11 :**
ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ముస్లిం దివ్యాంగులకు ఏపి ఎన్జీఓస్ ఆఫీసులో "దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు' ఏర్పాటు చేశారు. కుల, మతాలకు అతీతంగా సమసమానత్వం దిశగా దివ్యాంగులకు "ఇఫ్తార్ విందు" ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని డిఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు తెలిపారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బి సి నాగరాజు, జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ, జమాతే ఇస్లాం నాయకులు చాంద్ బాషా, ఇస్మాయిల్, కబీర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఆకలితో ఉన్న ప్రతి పేదవాడికి అన్నం పెట్టాలని, ఆపదలో ఉన్న వారికి, బీదలకు, అనాధలకు సహాయం చేయాలని ఖురాన్ గ్రంథం బోధిస్తోందన్నారు ఈ పవిత్ర గ్రంధాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రపంచంలో వికలాంగులను చిన్న చూపు చూస్తున్న తరుణంలో ఇఫ్తార్ విందు ద్వారా వివక్షత తొలగిపోవాలని గొప్ప కార్యక్రమానికి నాంది పలకడం హర్షనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు కులమతాలకు అతీతంగా మరెన్నో చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడ రవి, జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆదోని డివిజన్ ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షులు కనకవీడు ఎర్రన్న, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల ప్రధాన కార్యదర్శి శవల శాంతిరాజు, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల నాయకులు తాయన్న, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు టౌన్ ప్రధాన కార్యదర్శి సందేపోగు హనుమంతు, అలాగే డిఈఎఫ్ కార్యవర్గం మరియు ముస్లిం వికలాంగులు శ్రేయోభిలాషులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన దృశ్యం

## మహిళ ఆత్మహత్యాయత్నం

**కోసిగి (తెలుగోడు), మార్చి 11 :**
కోసిగి మండలం పరిధిలోని డి.బేలగల్లు గ్రామానికి చెందిన సుజాత ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్యానికి పాల్పడింది. భర్త శివరాముడు ప్రతి రోజు మద్యం తాగుతున్నాడని, మానుకోవాలని ఎంత చెప్పినా మానుకోక పోవడంతో తానే చనిపోవాలని ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపింది. వెనువెంటనే గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కోసిగి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కై 108 లో ఆదోని ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది అంబులెన్స్‌లో చికిత్స అందించడంతో కోలుకుంటున్నట్లు తెలిసింది.



## బదిలీపై వెళ్లిన ఎస్ఐ నిరంజన్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 11 :**
పెద్దకడబూరు మండల పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ నిరంజన్ రెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేనివని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ మారుతి, కోసిగి ఎస్ఐ రమేష్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పెద్దకడబూరులోని పోలీసు స్టేషన్ ఆవరణలో బదిలీపై వెళ్లిన ఎస్ఐ నిరంజన్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన వీడ్కోలు సభలో వారు మాట్లాడుతూ పెద్దకడబూరు పోలీసు స్టేషన్ ఎస్ఐగా నిరంజన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మండలంలో క్రైమ్ రేటు తగ్గుముఖం పట్టిందన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలలో ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అమలు చేసి మండల ప్రజలకు నిరంజన్ రెడ్డి చాలా దగ్గరయ్యారని తెలిపారు. గ్రామాలలో ప్రజల నుంచి ఏ సమయంలో ఫోన్ చేసినా విసుగు చెందకుండా బదులు ఇచ్చేవారని ప్రశంసించారు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి హయాంలోనే పెద్దకడబూరు మండల పోలీసు స్టేషన్ కు దేశంలోనే అత్యుత్తమ పోలీసు స్టేషన్ గా ఏపీ నుంచి అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. చిత్తశుద్ధితో పని చేసే ఉద్యోగికి ప్రజల నుంచి మంచి గుర్తింపు లభిస్తుందని, అలాంటి గుర్తింపు ఎస్ఐ నిరంజన్ రెడ్డికి లభించిందన్నారు. ఉద్యోగికి బదిలీ అనేది సర్వ సాధారణమని అన్నారు.

***అందరి సహకారంతో ప్రజలకు దగ్గరయ్యా...***

పోలీసు ఉన్నతాధికారులు, ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే తక్కువ కాలంలో పెద్దకడబూరు మండల పోలీసు స్టేషన్ లో ఎస్ఐగా ప్రజలకు దగ్గర అయ్యాయనని బదిలీపై వెళ్లిన సన్మాన గ్రహీత ఎస్ఐ నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు, ఇక్కడి ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీసు స్టేషన్ లో పని చేస్తున్న పోలీసు సిబ్బంది తోడ్పాటుతోనే దేశంలోనే అత్యుత్తమ పోలీసు స్టేషన్ గా పెద్దకడబూరు పోలీసు స్టేషన్ కు అవార్డు లభించిందని, దీనికి ప్రతి ఒక్కరికీ ఎస్ఐ నిరంజన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఎస్ఐ నిరంజన్ రెడ్డికి పోలీసు స్టేషన్ తరుపున కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐలు మారుతి, రమేష్ రెడ్డి, ఏఎస్ఐ శివరాములు, పోలీసు సిబ్బంది శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తరువాత ఆయా పార్టీల నాయకులు ఎస్ఐ నిరంజన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ తలారి మీ సేవ ఆంజనేయులు, టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, టీడీపీ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, ఆర్టీఎస్ తాలూకా కన్వీనర్ దశరథ రాముడు, సొసైటీ డైరెక్టర్ గోనుమాను నరసన్న, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్కన్న, టీడీపీ యువ నాయకులు ఇంద్రసేనారెడ్డి, నీలకంఠ రెడ్డి, టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, సత్యన్న గౌడ్, నరసింహారెడ్డి, బీపీ ఈరన్న, పెద్దయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనందరాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు అంజినేయ, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



ఎస్ఐ నిరంజన్ రెడ్డి వీడ్కోలు సభలో మాట్లాడుతున్న టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోసిగి సీఐ మంజునాథ్



మాట్లాడుతున్న సన్మానగ్రహీత ఎస్ఐ నిరంజన్ రెడ్డి. ఎస్ఐ నిరంజన్ రెడ్డి వీడ్కోలు సభకు హాజరైన మండల ప్రజలు



బదిలీపై వెళ్లిన ఎస్ఐ నిరంజన్ రెడ్డిని సన్మానిస్తున్న కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ మారుతి, పోలీసు సిబ్బంది, టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి

## పేదరికం లేని అభివృద్ధి గ్రామాల దిశగా అడుగులు

### జీవనోపాధులు కలిగిన పంచాయతీల నిర్మాణానికి సమష్టి కృషి ఎంపీడీవో ప్రభావతి దేవి..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 11 :**
గ్రామ పంచాయతీలను పేదరికం లేని, సమగ్ర అభివృద్ధి సాధించిన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కలిసి పనిచేయాలని ఎంపీడీవో ప్రభావతి దేవి సూచించారు. మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామ పంచాయతీల నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. బుధవారం పెద్దకడబూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభావతి దేవి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐకేపీ వీఏవోల కోసం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ మహేష్ పాల్గొని గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభావతి దేవి మాట్లాడుతూ గ్రామాలను ఆరోగ్యవంతమైన, బాలల స్నేహపూర్వక వాతావరణం కలిగిన పంచాయతీలుగా తీర్చిదిద్దాలని అన్నారు. గ్రామాల్లో శుద్ధమైన తాగునీటి సౌకర్యం, పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ నీటి వనరుల పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా స్వయం సమృద్ధి సాధించిన, అన్ని మౌలిక వసతులు కలిగిన పంచాయతీలుగా గ్రామాలను అభివృద్ధి చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సామాజిక న్యాయం, సామాజిక భద్రత ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించే సమయంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని ఆమె తెలిపారు. మహిళలకు అనుకూలమైన గ్రామ పంచాయతీల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు. మంచి పాలనతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీవిద్య, మాజీ ఎంపీపీ నరవ శశిరేఖ, ఈఓఆర్డీ జయరాముడు, డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మన్న, ఏపీవో చంద్రశేఖర్, ఏపీఎం శ్రీనివాసులు, ఈసీ ఖాదర్ బాషా, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల వీఏవోలు పాల్గొన్నారు.





శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభావతి దేవి





పంచాయతీల అభివృద్ధిపై వివరిస్తున్న ట్రైనర్ మహేష్



ఎస్ఐ మారుతిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనందరాజు

## ఎస్ఐ మారుతిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 11 :**
పెద్దకడబూరు మండల పోలీసు స్టేషన్ లో ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ఈ. మారుతిని బుధవారం పోలీసు స్టేషన్ లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనందరాజు ఆధ్వర్యంలో కాంగ్రెసు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐ మారుతికి శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో శాంతిభద్రతలు, స్థానిక పరిస్థితులపై చర్చించారు. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిక్కన్న, రాజ్ కుమార్, చిన్నతుంబళం నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

## దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 11 :**
ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు వైస్ ఎంపీపీ ముత్తమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు కేపీ యల్లప్ప, హులికన్వి గ్రామ సర్పంచ్ చిన్న మహదేవ, వైసీపీ ఇంటలెక్చువల్ వింగ్ అధ్యక్షులు కమ్మరి బ్రహ్మయ్య స్పష్టం చేశారు. బుధవారం పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ శివారుల్లో ఆదోని - మంత్రాలయం ప్రధాన రహదారిలో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో వేసవి దృష్ట్యా చలివేంద్రాన్ని వైస్ ఎంపీపీ ముత్తమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజలు , పాదయాత్ర ద్వారా వెళ్లే భక్తులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజలకు తాగునీరు అందించడం ఒక గొప్ప సేవా కార్యక్రమమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నరసింహమూర్తి, గ్రామ పెద్దలు, వైసీపీ నాయకులు సోమప్ప ధని, లింగన్న గౌడ్, మదిరె రాముడు, పెద్ద మహాదేవ, వలీ బాషా, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు బొడ్డన్న, బీసీ సెల్ అధ్యక్షులు చిన్న కడబూరి, వైసీపీ మండల వాలంటీరీ విభాగం అధ్యక్షులు కమ్మరి నరసింహ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ముత్తమ్మ



ఆదోని - మంత్రాలయం రహదారిలో చలివేంద్రాన్ని ప్రారంభించిన వైస్ ఎంపీపీ ముత్తమ్మ

## టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డిని కలిసిన ఎస్ఐ మారుతి

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 11 :**
మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డిని బుధవారం మాధవరంలోని టీడీపీ కార్యాలయంలో పెద్దకడబూరు ఎస్ఐ మారుతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దకడుబూరు మండలంలోని వివిధ గ్రామాలలో పరిస్థితులు, ప్రజా సమస్యలు మరియు పలు సామాజిక అంశాలపై వారు చర్చించారు. ప్రజలకు న్యాయం జరిగే విధంగా నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలని టీడీపీ ఇన్ చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఎస్ఐ మారుతికి సూచించారు. అలాగే గ్రామాలలో శాంతిభద్రతలు కాపాడడంలో పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.



టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ మారుతి



# మహేశ్ అభిమానులకు హరీష్ క్షమాపణలు

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులకు దర్శకుడు హరీష్ శంకర్ క్షమాపణలు చెప్పాడు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రమోషన్స్ సమయంలో జరిగిన ఒక చిన్న పొరపాటు ఈ వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ అభిమాని ఒకరు ఎక్స్ వేదికగా ఈ సినిమా మహేష్ బాబు రికార్డులను బద్దలు కొట్టాలనే అర్థం వచ్చేలా ఒక పోస్ట్ చేశారు. దీనికి హరీష్ శంకర్ రిప్లై ఇవ్వడంతో మహేష్ బాబు అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఈ వివాదం ముదరడంతో హరీష్ శంకర్ వెంటనే స్పందిస్తూ వివరణ ఇచ్చారు. షూటింగ్ పనుల్లో మరియు సెన్సార్ కార్యక్రమాల్లో బిజీగా ఉండటం వల్ల ఆ ట్వీట్‌ను పూర్తిగా చదవకుండానే, కేవలం అభిమాని ఉత్సాహాన్ని చూసి పొరపాటున స్పందించానని ఆయన పేర్కొన్నారు. తనకు మహేష్ బాబు అంటే ఎంతో గౌరవమని, గతంలో ఆయన నటించిన 'పోకిరి' సినిమా గురించి కూడా తాను ఎంతో పాజిటివ్‌గా మాట్లాడానని గుర్తుచేశారు. అంతేకాకుండా, రాజమౌళి- మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా పెద్ద రికార్డులు సృష్టించాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన రిప్లై వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే బేషరతుగా క్షమాపణలు కోరుతున్నానని హరీష్ శంకర్ ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సమయంలో తాను కావాలని ఇలాంటి వివాదాలు చేసే వ్యక్తిని కాదని ఆయన స్పష్టం చేశారు.

# సుడిగాలి సుధీర్ ..మూవీ గోట్




ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం గోట్. గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్ అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను మార్చి 26న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నట్లు తెలిపింది. త్వరలోనే ఈ చిత్రం నుంచి ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ.. ప్రస్తుతం గోట్ పోస్ట్ ప్రోడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలువబోతుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుందని. తప్పకుండా ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత అన్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, సర్వధమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, బ్రహ్మాజీ, పృథ్వీ, ఆడుకాలం నరేష్, రాజేంద్రన్, ఆనంద్ రామరాజ్, చమ్మక్ చంద్ర, పమ్మీ సాయి, నవీన్ నేని, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, నేపథ్య సంగీతం: మణిశర్మ, డీఓపీ: రసూల్ ఎల్లోర్, ఆడిషనల్ డీఓపీ: సన్నీ కూరపాటి, ఎడిటర్: విజయ్ ముక్తవరపు, ప్రొడక్షన్ డిజైనర్ : రాజీవ్ నాయర్, , కో ప్రొడ్యూసర్: సమైరా రెడ్డి.ఎన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ప్రసూన మండవ, దర్శకత్వం: వేదవ్యాస్, నిర్మాత: చంద్రశేఖర్ మొగుళ్ళ..........................................................

# కమల్, రజనీల మూవీపై సర్వత్రా ఆసక్తి



ప్రస్తుతం సోషల్ మీడియాలో రెబల్ స్టార్ ప్రభాస్ మరియు మలయాళ సెన్సేషనల్ డైరెక్టర్ దిన్‌జిత్ అయ్యతాన్ కలిసి ఉన్న ఒక ఫోటో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటో వీరిద్దరి కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కబోతుందనే వార్తలకు బలం చేకురుస్తుంది. ఇటీవల 'కిష్కింధ కాండం' మరియు 'ఏకో' వంటి విభిన్నమైన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దిన్‌జిత్, స్వయంగా ప్రభాస్‌ను కలిసిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని, ముఖ్యంగా ఆయన వడ్డించిన రుచికరమైన 'ప్రాన్స్ బిర్యానీ'ని ప్రశంసిస్తూ దిన్‌జిత్ పెట్టిన ఇన్స్టాగ్రామ్ పోస్ట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ముఖ్యంగా ఈ సమావేశం వెనుక హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ ఉండటం గమనార్హం. గతంలోనే హోంబలే సంస్థ ప్రభాస్‌తో మూడు సినిమాల భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో 'సలార్ 2' కాకుండా, మిగిలిన రెండు చిత్రాల్లో ఒకటి దిన్‌జిత్ దర్శకత్వంలో ఉండే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్ నడుస్తుంది. విలక్షణమైన థ్రిల్లర్లను తెరకెక్కించడంలో దిన్‌జిత్ సిద్ధహస్తుడు కావడంతో, ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఒక సరికొత్త తరహా కథను ఆయన సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్' మరియు 'కల్కి 2' వంటి భారీ ప్రాజెక్టులతో ఎంతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబో ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ ఇద్దరి కలయికతో ఒక డిఫరెంట్ సినిమాను చూడవచ్చని అభిమానులు ఆశిస్తున్నారు.

# ది ప్యారడైజ్‌లో ఆయా షేర్ సాంగ్



నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రస్తుతానికి 'ది పారడైజ్' అనే సినిమా రూపొందుతోంది. ఈ సినిమాను ఒక పూర్తిస్థాయి రా అండ్ రస్టిక్ సినిమాగా రూపొందిస్తున్నారు మేకర్స్. నాని కెరీర్‌లోనే మొట్టమొదటిసారిగా, ఎప్పుడూ ఊహించని విధంగా ఈ సినిమాలో ఒక రా అండ్ రస్టిక్ పాత్రలో కనిపిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్ బాగా వర్కవుట్ అయింది, ప్రేక్షకులలో అంచనాలు రేకెత్తించింది. ఇక తాజాగా రిలీజ్ అయిన 'ఆయా షేర్' సాంగ్ బాగా ప్రేక్షకులలోకి వెళ్ళింది. ముఖ్యంగా సాంగ్ భిన్నంగా ఉండడంతో, ఈ సాంగ్ వినేందుకు శ్రోతలు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సాంగ్ రాసిన లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్ మీడియాతో ఈ సాంగ్ విశేషాలు పంచుకున్నారు. అయితే ఈ విశేషాలు పంచుకుంటున్న క్రమంలో ఆయన ఈ సినిమాలో నాని నేపథ్యం గురించి చెప్పుకొచ్చారు. నిజానికి ఈ సినిమాలో నాని ఒక వేశ్యా వాటికలో ఉంటాడని ముందు నుంచి ప్రచారం జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు నాని తెగ పేరును పొరపాటున కాసర్ల శ్యామ్ సంబోధించారు. ఈ తెగ 'సవారి తెగ' అని కాసర్ల శ్యామ్ చెప్పుకొచ్చారు. ఈ సాంగ్ చేయడం తనకు చాలా అదృష్టమని, 'దసరా' తర్వాత తనకు ఈ సినిమా కూడా అంత పేరు తెచ్చే సినిమా అవుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు.

# త్రిష, విజయ్‌లది వ్యక్తిగత వ్యవహారం

తమిళ స్టార్ నటుడు, తమిళ వెట్రీ కళగం అధినేత విజయ్ మరియు హీరోయిన్ త్రిషల వ్యక్తిగత జీవితంపై నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇటీవల చెన్నైలో జరిగిన ఒక వివాహ రిసెప్షన్‌కు విజయ్ త్రిష కలిసి ఒకే కారులో రావడం సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా విజయ్ భార్య సంగీత విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారనే వార్తల మధ్య వీరిద్దరూ కలిసి కనిపించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ వివాదంపై ఖుష్బూ స్పందిస్తూ.. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయమని, దానిని భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదని పేర్కొంది. విజయ్, త్రిషల వ్యవహారంతో సామాన్య ప్రజలకు ఏం సంబంధం ఉంటుందో తనకు అర్థం కావడం లేదని.. అది వారి పర్సనల్ లైఫ్ అని, దానిని గౌరవించాలని సూచించింది. విజయ్ ప్రస్తుతం రాజకీయాల్లో చురుగ్గా ఉన్న నేపథ్యంలో ఈ వివాదం ఆయన ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందా? అని అడగ్గా.. ప్రజలు చాలా తెలివైన వారు. ఎవరికి ఓటు వేయాలో వారికి తెలుసు. వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదు అని తెలిపింది. నటులైనా, రాజకీయ నాయకులైనా వారు కూడా మనలాగే సాధారణ మనుషులని, వారి ప్రైవసీని దెబ్బతీయడం సరికాదని ఈ సందర్భంగా ఖుష్బూ చెప్పుకోచ్చింది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.